ఆనందవిహారి

మల్లాది రామకృష్ణశాస్త్రి

దక్షారామ భీమేశ్వరుడటూ, ఆతగాడటూ. అయితే ఆ స్వామివారికి ఉన్న దక్షత, తత్పరత ఈయనకు లేదు. కేవలం భోగట్టామట్టుకే ఈయన భోగం.

తురగా రామన్నగారు ఇంటికి ఎదురుగుండా ఉన్న లోగిలి అరుగుమీద కూర్చున్నారు.

ఆ అరుగు, ఆయనకు ఒక్కడికే హక్కు, భుక్తం.

దారిని పోయే వారెవరైనాసరే ఎదుట నిలబడి, మాట్లాడి పోవడమే కాని, సరసను కూర్చునే సాహసం చేయరు.

కారణం వారిమీదున్న గౌరవం.

మరిన్ని వారి గడుసుదనం.

మనిషి, చక్కనివాడు, చాలినవాడు.

ఎందుకో ఒకందుకన్నా, ఎవరికీ బేజాపవలసిన అవసరం లేనివాడు. ఎవరి అవసరానికన్నా, అక్కరకు వచ్చేవాడు.

సాధారణంగా ఎక్కడికీ కదలడు. ఎప్పుడో కాని, అదన్నా దేవకార్యమైతేనే ఏ ఊరూ పోవడం అంటూ లేదు. అదన్నా సకృత్.

ప్రొద్దునా, సాయంకాలమూ ఊరి శివారున, అంటే, ఓ మైలులోపే అనుకోండి, ఉన్న తమ

పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డు పైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము సమూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగ విషయములో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మికముగా ద్రవ్య లాభము మొదలగు వాని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు.—1—25 లకు మాత్రము వి. పి. గా పంపగలము ఏ. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమైనా వున్నయెడల శాంతిచేయువిధానం కూడా తెలుపగలము. వివరములు మా పూర్తియైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయ బడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW) Jullundur City

క్రొత్త పెద్ద డబ్బా

కాల్గేట్

బేబీ పౌడరు

ఎక్కువ పౌడరు...
ఎక్కువ పొదుపు...
సులభంగా పెట్టగల
క్రొత్త మూత!

పసిపాప యొక్క
లేత చర్మమునకు
ఉపశమనము కలిగించును!

ఆనంద-లహరి

తోటలోకి పోవడం.

ఆ భావిదగ్గర స్నానం చేయడం, కాస్సేపు మామిడి తిన్నెమీద కూర్చుని, ఏ కృష్ణా—రామా అనుకోవడం, మరో కాస్సేపు గోవు వెన్ను నిమురుతూ దాన్ని మాలిమి చేయడం, దాని తువ్వాయితో, పసిపిల్లడల్లే గంతులువేస్తూ ఆడు కోవడం.

ఈలోగా తోట కనిపెట్టుకుని ఉన్న వెంకన్న, పాలు తీసి, తనకో పాలుంచుకుని, మిగిలినవి వారికి అందీయడం. అందులో సోపాలు దొడమాకు దొన్నెలో ఉంచుకుని, ఈశాన్యంగా మారేడు వృక్షం క్రింద ఉన్న పుట్టలో పోయడం, 'నాగేంద్రుడా, వచ్చి, నీ అనుష్ఠానం కానిచ్చుకో వయ్యా!' అని మ్రొక్కడం.

ఓ పది అంగలు వెనక్కువేసి, అక్కడున్న తులసి మొక్కల దగ్గర ఏకపాదాన నిలుచుండి, పుట్టలో నాగేంద్రుడు బయటికి వచ్చి, సూర్య నమస్కారం చేసి, మళ్లీ పుట్టచేరుకునేదాకా, తానూ, సూర్యభగవానుడికి అంజలిపట్టి అలాగే ఉండిపోవడమూ. ఇంటికి తిరిగివస్తూ, పిల్లలున్న ఏ ఇంటివద్దనో మిగిలిన పాలు ఇవ్వడం. ఇంట్లోకి వెళ్లి, ఇంటికైన ఇల్లాలు తులసిపూజ ముగించుకుని, తనకు మ్రొక్కేంత పర్యంతమూ అక్కడే నిలుచోవడమూ. ఆవిడ ఇచ్చిన తీర్థం పుచ్చుకుని, పొడిబట్ట కట్టుకుని, తమ తండ్రి గారు పూర్వం అనుష్ఠానం చేసుకొనేచోట, ఒక్క క్షణం కూర్చుని, వారిని స్మరించుకోవడమూ. తలుపు దగ్గరసా వేసి, వచ్చి ఆ అరుగుమీద చదికిలపడటమూ. ఇదీ ఈయన పద్ధతి!

ఆ ఎదురిల్లు శివరామయ్యది. అంటే శివయ్య.

వాళ్ళ తండ్రీ, తన తండ్రీ సహాధ్యాయులు. తాము దిప్పకాయలు. ఇద్దరూ, నీ, నా భేదం లేకుండా, కలిసికట్టుగా మొట్టికాయలు తిన్నారు. తనకు పుష్టి ఉంది, దులిపేసుకున్నాడు. వాడు, వట్టి అర్భకుడాయెను! వడలేక, కోనసీమ బ్రాహ్మణుల వెంట పడిపోయి, అక్కడే ఉండిపోయి, వేదపండిట్లు, దేశంపట్టి సంచారంచేసి, తండ్రికి ఉపచారం చేయవలసిన అగత్యం కలగడంతో, తెలిసి తిరిగి వచ్చాడు. ఆ పండు రాలిపోవడంతో, ఇంటిపట్టున ఒక్కడూ ఉండలేక, భద్రాద్రి రాముణ్ణి నమ్ముకుని అక్కడే పడుందామను కున్నాడు. రామకోటి సమర్పించాడు. ఎట్టకేలకు తాను, పదేపదే కోరగా, మాట తీసివేయలేక, తంబుర చిరతలతో సీతారాముల విగ్రహాలతో, తిరిగి వచ్చాడు.

పెళ్లి చేసుకోలేదు. అమ్మవంకవారూ, అయ్యవంకవారూ వెదురువాటుగా, అక్కడా అక్కడా ఉన్నా, ఆ బాంధవ్యాలు తిరగనేయ్యడమన్నది లేదు. అక్కడ శ్రీరాముణ్ణి నమ్మినట్టే ఇక్కడ ఈ రాముణ్ణి నమ్ముకున్నాడు. మరే

ప్రమేయం అక్కర్లేదను కున్నాడు.

తొలికోడి కూసేవేళకు మేలుకోవడమూ, రామా! అనుకుంటూ ఇంతసేపు పాడుకోవడమూ, సంధ్యావందనాదికము ముగించుకుని, రెండు ఝాములదాకా, ఓ పది పన్నాలు చెప్పడం, ఓ ఇంతసేపు సామగానం చేయడం, అప్పుడు, ఇంత పులగమేసుకుని, ఓ బెల్లప్పుముక్క దాని మీద ఉంచి, అదే పుచ్చుకోడం, గుండుచెంబెడు మంచినీళ్లు పుచ్చుకోడం, మడివిడిచి ఇవతలకు వచ్చి, రాముడికి నివేదన చేసిన ఆ బెల్లమ్ముక్క రామన్నచేత ఉంచడం, అప్పుడూ రామన్న లేచి వెళ్లి భోంచేయడం.

తాను వెళ్లి రామన్నగారి పంచలో, అనవాయితీగా పడుకుని ఉండే మేకపిల్లల పక్కనే చోటు చేసుకుని అంగవస్త్రం వేసుకుని నడుంవాల్చడం. రామన్నతో కలిసి, సంజెపూట, అలా తోటలోకి వెళ్లిరావడం, తిరిగివచ్చి, ఊరుమాటుమణిగే దాకా, ఆ పంచలోనే కూర్చునిపోయి, పిచ్చాపాటీ చెప్పుకుంటూ, అప్పుడు అక్కడే, రాముణ్ణి తలచుకుంటూ, ఓ పక్కాఝాము నిద్రపోవడం ఇదీ ఆయన పద్ధతి. రామన్నతో, ఆ ఇల్లాలు సీతమ్మతో తప్ప మరెవ్వరితో మాట్లాడడు. ఆ అగత్యమూ లేదు.

ఒక్క నవరాత్రుల్లోమటుకు, దివాణంవారు, పిలిచి ప్రత్యుత్థానం చేయడమూ, వీరు, కాదనకుండా, విజయదశమి పర్యంతమూ ఉదయాన్నే వెళ్లి, అపరాహ్ణమయేదాకా వేదపారాయణ చేయడమూ, ఆ దీక్ష అనంతరం ఆ దంపతులను దీవించి, తాంబూలంమట్టుకు స్వీకరించి, తనదారి తానురావడం. అంతే!

పండగల్లో మట్టుకు దివాణానికి వెళ్లడం. దేనికా అంటే, వారి తాతగారినాటినుంచీ వస్తూన్న ఆచారం! అది మానరాదని వారి తండ్రిగారి కోరిక!

—చిన్న నాడందరూ రాముడూ అని పిలిచే వారు, శివయ్యను.

అప్పుడు, సరే.

'ఊరికి, ఇందరు రాములేమిటి? వీడే మా రాముడు.

నేను శివుణ్ణి. అందరూ నన్నలా పిలిస్తే సంతోషిస్తాను' అన్నాడు గ్రామానికి తిరిగి వచ్చిన రోజుల్లో. అప్పటినుంచీ శివరామయ్య శివయ్య అయిపోయి, రామన్న ఏకో రామయ్య అయినాడు.

శివకేశవులకు లాగానే ఇద్దరికీ అభేదం! గ్రామంలో వారి, అభిప్రాయమూ ఆదరణా కూడా అదే.

అయితే ఒక్కటె తేడా. ఈ రాముడు, ఎప్పుడూ కన్నుల ఎదుట ఉంటాడు. పలుకుతాడు. శివుడి దర్శనమే కాదు.

—రామన్నగారు, కూర్చొన్నచోటనుంచి కదలకపోయినా, ఊరిలో, ముఖ్యంగా ఆ వాడలో, చీమచిటుకుమంటే ఆయన చెవిని పడకమానదు. అదెల్లాగంటే, ఎల్లాగో! దక్షారామ భీమేశ్వరుడటూ, ఇతగాడిటూ! అయితే, ఆ స్వామివారికి ఉన్న దక్షత, ఆ తత్పరత ఈయనకు లేదు. కేవలం భోగట్టామట్టుకే ఈయన భోగం!

ఆ గ్రామంలో, ఆ వాడలో, మామిడివలస మొఖాసాదారు ప్రాపకంలో కొంతకాలం ఉన్నటువంటి, నాగాయ్ అనే సిగరాజకుమారి లోగిలి, మాంచి ఖుషాసుగా ఉంటుంది. ఆమె చేసుకున్న సుకృతంకొద్దీ, ఒక్క ఆడపిల్ల కలగడం, అయిదో నెల్లో, ఆ పిల్లను తీసుకువచ్చి ఈ రామన్నగారికి చూపించి, అయ్యా! వెనుకటికి, నా చిన్నతనంలో అంటే అయిదారేళ్లప్రాయంలో, మా తల్లి వెంట దివాణానికి వెళ్లాను. అవి దేవీ నవరాత్రులు. మావాళ్లు మేజువాణి చేస్తున్నారు. నేను, తాళం పట్టాను. సభలో తమ నాయనగారు, నేనున్నచోటికి రవంత పక్కనే దయచేసి ఉన్నారు. వారు, నా వంకనే కన్నప్పగించి చూడటం మాతల్లి గమనించింది. నాకు సైగచేసింది. సభామర్యాదలు అప్పటికి నేర్పి ఉన్నది గనుక, తాళంవేయడం ఆపి, ఒక అడుగు ముందుకు వేసి, వారికి వందనం చేశాను. తమ నాయనగారు, తల ఊగించారు! మా తల్లి వారికి కనులతో మొక్కింది.

సభ ముగిసింది. వారు, నన్ను దగ్గరకు పిలిచి 'నాకు మొక్కినచేత, రేకపండాలి' అంటూ నాచేయి అందుకుని, 'రాజయోగ్యమగు జన్మని పయ్యేవులే' అని దీవించారు. వారి దీవెన నా సుకృతమై ఫలించింది.

తండ్రికి పేరు తెచ్చిన కుమారులు తమరు. మా చిన్నది, మీ చేతి చలువను రాణించవలెనని వచ్చినానయ్యా—అని, బిడ్డను వారికి అందించగా—

రామన్నగారు, పసిదాని మోమువంక చూచి, తలయూచినవారై, కన్నులర మోడ్చి, పకపక నవ్వి, 'నాగమ్! శ్రీనాథమహాకవి, వైభవంగా దేశసంచారం చేసే తరుణాన, ఓ గ్రామంలో, ఒక వంటివారి కోడలు తమకు, సపర్యలు చేయంగా, మెచ్చుకున్నవారై, ఒక్క కందంలో ఆ అందం అంతా ఇమిడ్చినారట! నీ కూతురిదీ అంత రాణింపే' అంటూ పయ్యెద దిద్దినట్లు, ఆ పాపను నిమిరినవారై, 'ఈడొచ్చిన తరువాత, కనిపించవేపిల్లా! నా హస్తవాసి, ఎంతగా ఫలించిందో, చూదాం!' అని తల్లిచేతి కిచ్చారు.

అది, ఇప్పటికి, పదహారేళ్లనాటి కథ!

—ఆనాడు మాఘ పూర్ణిమ.

రామన్న, శివయ్య తోటలో ఉన్నారు. అలా తిరుగుతూ, కబురు లాడుకుంటున్నారు. తులసీ మొక్కలమీదుగా, కస్తూరి వాసనలు కమ్మినవి. 'నాగేంద్రులవారు వనవిహారం చేస్తున్నారల్లే ఉందిరా' అన్నాడు శివయ్య. 'వారికేమయ్యా, దివానికో తీరున పరిమళించేరు. వలపులు వెదజల్లేరు. కాని, శివునిలెంకలై నందుకు, వారి హృదిని మదనుడుదయించడు. నీ అంతటి ఒంటరులే వారు!'

'అదేమిట్రా, సదాశివులవారికి, యత్నిం

ఉబ్బసమునకు,
వెల్స్ బాంకోలో (పౌడరు)
దగ్గు-ఆయాసములను అతిశీఘ్రముగా నివారించును.
అన్నిమందుల షాపులలో దొరుకును
బాంకోల్ ప్రైవేటు లిమిటెడ్ కలకత్తా
శ్రీ వెంకటేశ ట్రేడర్సు,
గోపాలరెడ్డి రోడ్డు... విజయవాడ-2.

నారసింహ లేహ్యం
బంగారు చేరినది. మేహము, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బీ రు. 3-8-0.
రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజి రు.1-1-0.
మా క్యాటలాగు, కాలెండరు ఉచితం.
పి. సి. ఏ. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.



ఆంధ్రప్రదేశ్ లోని
అన్ని చోట్ల స్టాకిస్టులు కావలయును.

చిత్ మోహినీ స్వర్శకలదవి, పురాణోక్తం కదరా!'

'అలాగే, వీగానమోహినీవో, ఇక్కడ సాక్షాత్కరించాలని నీ అభిలాష? నీది, వేదవాక్కు కదరా! అలాగేకానీ, రానీ—'

—రానే వచ్చింది. సమీపించింది.

రామన్నగారు, ఒక్క అడుగు ముందుకువేసి అలా, చూచారు! శివయ్య, 'ఎవరు వారూ!' అని, తనలో తాననుకున్నాడు.

రామన్న వంకచూసి, నవ్వింది.

'అసి! నీవటే! మననాగావ్ కూతురు! పదారేళ్లనాడు, మనమన్నమాట, ఫలించిందయ్యా,

ఆనంద-లహరి

శివయ్యా! ప్రాయాన వచ్చి, నా కంటపడవే అని, ఓ బాలపాపతో అన్నాను. అలాగే వచ్చిందయ్యా. వచ్చినందుకు సంతోషమే.

చూశాము! తీరా—

చూడగ నల్పు!' అని నవ్వుకుంటున్నారు.

అలదానికి, చిడిముడితనం, నిలువు నిలువునా కులుకంగా, మరింత సమీపించి, సగౌరవంగా, జాలిగా, రామన్న వంకచూసి, వారిని చూపులతో



కమ్ముకున్నది. వారూ, జాలిదలచారు.

'కాని, పరిశోభితదివ్యకురంగనాభము...'

అది, తీవులుపోయింది. వారు మెచ్చుకున్నారు.

'ఏ జాడను, రాజయోగ్యమగు జవ్వని..'

దానికి పరవశమయినది.

శివయ్య అన్నాడు: 'నల్లని మేని సంచుదానా, నీ పేరేమి?'

'మీవంటి పెద్దలు గంగి అని పిలిచేరయ్యా!'

'రామన్నా, వీరి ఇంటి పేరేమన్నావ్?'

'మునుపు, గేదగి. ఇకనుంచి, కేతకి...'

'నీకు, ఈ పరిమళమూ, మాకీ పరవశమూ, శాశ్వతమేలే.'

అది, వారి హస్తములందుకున్నదై పయ్యెద కద్దుకుని, పది మొక్కులిచ్చింది.

'నల్లనిదానా, నా ఇంట రాముడున్నాడే.

ఆటపాటలతో వాని వర్చించేవా?' అన్నాడు శివయ్య.

'నల్లని మేని సంచుతో, ఆడగరాదుగా' అని అందుకున్నాడు రామన్న.

'రాదుగా?'

'రాదయ్యా. మీ రాముడు నీలమేఘశ్యాముడు.

ఈ శ్యామాంగి వారికి నచ్చదయ్యా!

నల్లనివారికి నలుపు గిట్టదు.

రాముని పూజకు కాదీ బాలపుట్టుక. రాజుల పూజలందు కొనేందుకయ్యా...'

'రామన్నా, నీ దీవెన, దీనికి శాపమా.'

'శాపము కాదన్నా జన్మకు సాఫల్యము...'

'విచిత్రంగా ఉందే....'

'ఆ వైఖరులే విచిత్రములు. చూడవలెవంటే, ఆ ఆగమ రహస్య మెరుంగవలె. క్రీడల తేలవలె.

మనమందుకు తగమవి, దీనినిరాజాపాల్జేసినాము.

వెంకన్నా, ఈ నల్లని పిల్లదానికి, దోసెడు జాజులిచ్చి పంపరా. నాగావ్ కూతురా, నా పేరు తలచుకుని, ఆ పూలు తురుముకొని, వీూ ఇంట విదురించి, కోటలో మేల్కొనవే!' అన్నారు రామన్నగారు.

రామన్నగారి పద్యము, మరునాటికి ఊరి మీదికి ప్రాకినది. ఆ కవనము జమీందారుల చెవి సోకినది.

నాగాం కూతురు రాణివాస మేలినది.

రామన్నగారు, వశ్యవాక్కులనీ, వారి చేయి సోకడం మహాప్రసాదమనీ, దేశంలో తెలిసింది.

—కొప్పులింగేశ్వరస్వామివారి ఉత్సవాలకు శివయ్యా, రామన్నా సందర్శనానికి వెళ్లిన సందర్భంలో అక్కడ మేజువాణిలో అందరిలో గమకంగా, మంచిఃబత్తూరి, మాంచి ఎత్తూరి, వాయు కనిని, పెండ్యాల నాగి, వీరి కంట పడ్డదాయమ.

'నగుమోముదానా, నీకున్నరూపు ఎవరికున్నదే, అడుగు ముందుకు వేసి, ఆ గజ్జె నీవు కట్టవే' అన్నారు. అది, అల్లంతనే వారికి మొక్కింది. కాని ముందుకు రాలేదు. 'పెద్దలు ఇప్పటికి మన్నించవలె. ఆపైన మనవి చేసుకొనేను'— అన్నది.

'మనవు లెందుకే. ఈ రూపానికున్న తోషమ్ము

మనకు తెలుసును లేనే --- ఇలా రా! ఇక నేలిమునుగుతో రా పనిలేదులే. పై, నాలు, ఉత్సవాలకు పయ్యెదకొంగు లొండిన చెక్కుకొని, చెంగున గంతేసి, స్వామిని సేవించుకునేవులే. నీ గొప్పకు తగిన కొప్పు అమరేనులేవే' అంటూ తలనిమిరి, 'ఆట సాగనీయవే' అన్నారు. అది, విస్మెరబోయి, అంతలో తేరుకుని, 'రామన్న గారే!' అంది. వారు, చిరునవ్వు నవ్వారు.

'అయ్యా! ఈ భాగ్యానికే నేను తపస్సు చేశాను. నేనై వచ్చేందుకు బిడియం వేసింది. రమ్మని పిలువనంపే సాహసం లేకపోయింది. ఇక నాజన్మ ఇంతేనేమో అనుకున్నాను.

రాముడే రూపము ఇచ్చాడు. రాముడే వచ్చి లోపమూ తీర్చాడు. ఈ మేలి ముసుగు తీరిన నాడు, వచ్చి దేవరను సేవించుకునేను.అనుమతించ రయ్యా....' అన్నది.

వారు ఒక్కనవ్వు నవ్వి, 'రఘురాముడు జటా ధారి. వరము, నా డీయవలెనే.

వీడు వట్టి రామన్న, వీవి సేవలెందుకే.

ఈ రామలింగడు, నీకు శాశ్వతదైవము. నేను ఉత్సవానికి పనికిరాని, ఉత్త విగ్రహాన్ని.

మళ్లీ మరోసారి, నే నీ ప్రాంతాలకు వస్తే,

నిన్ను చూసి, నీ కొప్పు నిమురక మాననులే' అన్నారు.

'అయ్యా! నా కొప్పున మీ చేతి దీవెన, విరులసరమై నిలిచేనుగా.

తలచినప్పుడెల్ల,మేలుగా, మీ చేయి సోకినట్లు, ఆ భావన లీయవయా!' అన్నది, మనసార మనవిగా. వారు, దయలు మీరగా,

'ఇచ్చినా మెచ్చినా ఆ రాముడేనవే భావన నిలుపవే.

నీకానూత్న మరియాద, నిత్యమూ జరిగేను..' అన్నారు.

మేజువాణీ పునః ఆరంభమైంది.....

—ఒక పర్యాయం, ఏం జరిగినదంటే, నాగేంద్రుడు విహరించే ప్రాంతాన చంపకారణ్యమైతే, మేలుగా ఉండేనుగాని, అని తలచి, రామన్నగారు, ఆ మొక్కల కోసం తుని గ్రామం వెళ్లడం సంభవించింది. రంగసానితోటలో అవి, కొల్లలు. కాని, ఎవరికీ ఇవ్వదు. అమ్మదు. వెలకు దొరకవా అంటే దొరికేను కాని అది, మేలుజాతి వాటినే తీసుకువెళదాం అనుకున్నారు రామన్నగారు.

తోటలోనే రంగసాని ఇల్లు.

రంగసాని, ఓ బరికె చేత పుచ్చుకుని, కేకలు పెడుతూ ఉరుకుతూంది. ఓ పది పన్నెండేళ్లపిల్ల పంచె విరిచికట్టి, అందకుండా పరుగెత్తుతూ, తోటంతా కలయ దిరుగుతూంది.

రామన్నగారు తోటలో అడుగు పెట్టగానే, పరుగులు తీస్తూన్న పిల్ల, అటునుంచి, దూసుకుంటూ, ఇటే వచ్చింది. రామన్నగారు వడు మొడిసిపట్టి నిలవేశారు. 'ఎందుకోయ్—ఆ పరుగు' అన్నారు.

'నా పరువు దీసేందుకు!—'అంది, తరుముకు వచ్చిన తల్లి. 'ఏళ్లొస్తున్నాయ్..ఏపాణెములేదు.



దేవప్రయాగ దివ్యదర్శనం ఫోటో — ఆర్. ముఖర్జీ (డెహరాడూన్)

మగరాయుడల్లే, పంచ ఎగకట్టి చూడండి ఆ వేషం, నే జెపితే వినదు. చేజేసుకుందామంటే అందదూ. రేపోమాపో ఓణీ వేసుకునే ఈడు!

లంగాయే కట్టందే!

రెబటల్లే ఉంటే, లంగా బాగుండదట.

గుమ్మటంలాగుండాలట! తనకు బాగుండదట. తా నిలాగే ఉంటుందట!

ఏ పెద్దలన్నా, ఏమేరంగా, ఏదే నీ కూతురు? అంటే ఏం జెప్పేది? ఈ కుమ్మరాం, అవి జెప్పేదా? నా ఇల్లు నాతోనే జెల్ల!

ఇహ నావల్ల కాదు. ఎవరివల్లా కాదు. మంచి రోజుచూసి ఆ రెక్క విరిచికట్టి, ఆ రామన్న గారి దగ్గరకీడ్చుకుకోతా! ఈ తిక్క, ఆయనొక్కడే కుదిర్చేది! ఒసే పెద్దీ, నాస్వామి రంగా, వారు ఏకళనన్నా ఉండి,నీమీద చెయ్యేస్తే, నీకు ఏనుగు మొత్తంత మొత్తొచ్చి, గున్నల్లే కూర్చున్నచోటనుంచి లేవలేకపోతే, అప్పుడు నా కళ్లు చల్లగా ఉంటాయే! అంతే నీ కిదే మందు' అంది.

రామన్నగారు నవ్వి, 'అవును అదే మందు!' అని పిల్లదాని వెన్ను నిమిరి, నడుంతట్టి, 'పిల్లా! నీ కా ఘనత కావలసినంత! నా మనుసుతో మోసుకు వచ్చాను. నీ వెన్నుమీద వేశాను! పై మాసంలో లంగాకట్టు. పై నెలలో ఓణీ వేసుకో! నడుములాగే ఉండనీ, నాగరీకత హెచ్చనీ. ఇదిగోనమ్మ నీ పిల్ల. నీ ఇల్లు నీ తోనే చెల్లు కాదులే! రాముడు, కానియ్యడులే!

ఎదుటసానిలేందీ, ఎలా ఊరేగుతాడు? గరుడవాహనం కదలనియ్యడుగా ? ఆ ఇక, అమ్మ వెంట, ఇంట్లోకి పోవే పిల్లా! ఎండ తగలకుండా ఉంటే రేపీపాటికల్లా వెన్నముద్దల్లే ఉండేవు. నీడపట్టున ఉంటే, నీటు పెరుగుతుంది.

వెన్నెల్లో తిరిగితే, కన్ను పెరుగుతుంది. ఓణీ వేసుకోంగనే వయ్యారం వస్తుంది. కులికి కులికి, కోటకి వడగెత్తవే—' అంటూ తల తడిమారు.

దానికి మొగాన కళ, చూపుల్లో రవంత బిడియం, రంగసాని గమనించి, 'అయ్యా, మీ రెవరో దేవుడల్లే వచ్చారు!' అంది!.

'దేవుణ్ణి కాను రాముణ్ణి.'

'అంటే?'

'వాణ్ణే..నీవన్న వాణ్ణే, తురగ గావారి రాముణ్ణి!'

'అయ్యో! అయ్యో, ఏమిటి నేను చేసుకున్న పుణ్యం!'

'మా తోటలో నాగేంద్రులవారు, విహరించే ప్రదేశంలో ఓ నాలుగుచంపకంమొక్కలువేయడం.'

'అంతకన్ననా, అయ్యో! అందుకోసం తమరు రావాలా? తమ సెలవైందంటే, యీ తోట బళ్లకెక్కించి నేను తీసుకురానా?'

'తోట తరలించుకు వస్తే, నీ చిన్నదాని సిగలోకి పూవులెక్కడనుంచి తెచ్చేవే! నాగేంద్రుడికివి చాలులే!'

'తమ చిత్తమయ్యా! అయ్యో, మరి, నా బిడ్డ...'

'నీ పెద్దరికం నిలిపేనులే. అది కోరింది రాముడిచ్చాడు.నీవు కోరింది అదికొల్లగొంటుంది!'

రామన్నగారి తోటలో, నాగేంద్ర విహారానికి చంపక వీధి ఏర్పడ్డదాయెను.

ఒకనాడు...వారు యథాప్రకారం అరుగు మీద కూర్చునిఉన్న సమయాన, ఓ పాతికముప్ఫై ఏళ్ల బ్రాహ్మణుడు, అంగవస్త్రధారి, మాసిన గడ్డంతో,రుసరుస, దారినిపోతూ, 'రామన్నగారి యిల్లెక్కడయ్యా!' అని ఓ కేక వేశాడు.

'ఏ రామన్న?'

'ఏ రామన్నా, యీ ఊరిమొత్తానికి ఏరామన్న న్నాడు...'

'ఓ, వాడా! ఎవరినడిగినా చెపుతారు!'

'అహా మన్వందరిలో జమ కావన్నమాట'

'కానులే. మాట! నీ పేరు?...'

'ఎవరినడిగినా చెపుతారు!—

'నీ పేరు నీదగ్గిర లేదా?—'

'దేశం మీదుంది!' ఆ బ్రాహ్మడు కొంచెం పొగరుమోతుగా అనేసి పోయినాడు. రామన్నగారు పోనిచ్చారు.

ఆనాడు.. సంజె ముదిరిన తరువాత, రామన్న గారూ, శివయ్యా, తోట మొగదలకు వచ్చేసరికి, అక్కడో అడ్డాల పాలకీ దిగిఉంది! ఒక బోయీ, వీరిని చూసి పరుగున వచ్చి, 'అయ్యా, పాలకీలో మా రాణీగారున్నారు. దాహమైంది. మాచేతి నీరు పుచ్చుకోరు. ఏం చెయ్యమన్నారు?' అన్నాడు.

'దయచేయమను, సలక్షణంగా. కొంచెంసేపు విశ్రమించి, దాహం తీర్చుకోవచ్చు' అన్నాడు శివయ్య.

'వారు పాలకీ విడిచిరారు.'

'పరువు విడిచి వీరూ రారు!—'

'వారు మా కంట పడరాదయ్యా!'

'మీరు అటు పొండయ్యా! మీ రాణీగారు, వయసు మళ్లిన వారైతే, మా తోబుట్టువుతో సమానం. చిన్నవారైతే, మా మనుమరాలితో సమానం. మా వద్ద యీ తెర చాటెందుకట్బీ! మీరు పొండి! అమ్మాయ్, రాణీగారూ, యిలా రా, అమ్మా!' అన్నారు శివయ్యగారు, పాలకీ ప్రాంతాలకు వెళ్లి.

రాణీగారు, తెరతొలగించుకుని వచ్చారు.

'ఆహా! దేవకన్యలాగున్నావు మా తల్లీ..యీ వెన్నెల నీ కోసమే వచ్చి నట్లుందమ్మా'— అన్నారు శివయ్య.

'ఏవయ్యా బ్రాహ్మడా, ఏలినవారము. నీవు అని అంటున్నావా?—

ఎన్నడూ రాజదర్శనానికి పోలేదా? నీకు ఎవరినెలా మరియాద చేయాలో తెలిసినట్టులేదే!'

'మాకు, తెలియదమ్మా, మన్నించండి. ఏం మర్యాదలు కోరేరో సెలవివ్వండి.'

'మాకు దాహమౌతూన్నదని, సేవకులు మనవి చేశారుగా. మేము యీ కటికనేల మీద మా పాదము మోపము. మీరు పోయి, తెండి!'

'మీరు పుచ్చుకునే గుక్కెడు దాహానికి యిద్దరెందుకమ్మా! మా రామన్న పోతాడులే. రాణీగారూ, మాతోటలో వెండిపాత్రలూ భరిణి పాత్రలూ లేవు. ఆకుదొన్నెతో దాహం పుచ్చుకునేందుకు తాము అంగీకరించాలి.'

'మంచిది, ఆ బ్రాహ్మడిని వేగిరం రమ్మను.'

రామన్నగారు తిరిగి వెళ్లాడు.

'ఏమయ్యా' అన్నారు రాణీగారు.

'అమ్మా!'

'ఆ వెళ్లిన బ్రాహ్మడికి వినయమేలేదే, మా సన్నిధిలో తలవంచుకుని నిలుచుండడేం? బిచ్చమెత్తుకుని బతికే వాడికంత తలబిరుసుతనమేం?'

'అమ్మా! రాణీగారూ, వాడుబిరుసో, మెత్తనో తమకేల! ఆడపిల్ల ఎవరైనా, ఆ సీతామ్మవారేఅని, నే అనుకుంటాను. తాము అన్నదానికి అందువల్లనే ఆగ్రహం రాలేదు. అమ్మా! తమకు, ఆకలా, కేవలం దాహమేనా? దాహమే అయితే, యిలా చిరాకుండకపోను.'

'బ్రాహ్మడా, నీవు నోరెత్తకు.'

—శివయ్య,తామసంఅణచుకుని ఊరకున్నాడు.

రామన్న దొన్నెలో నీరు పట్టి తెచ్చాడు. అందించబోయినాడు. రాణీగారికి మరింత ఆగ్రహం వచ్చింది. 'బ్రాహ్మణా! ఆగక్కడ! మాకు అందించే అర్హత నీకున్నదా?

మీ ఉత్తరీయాలు అక్కడ పరచి, అది, అక్కడ ఉంచు. కళ్లు మూసుకు వెనుదిరుగు.'

వారు, అలాగే చేశారు. రాణీగారు అందుకుని దాహం తీర్చుకుని, ఒకకాసు ఉత్తరీయాల మీదికి విసిరేసి, 'తీసుకు సెలవు పుచ్చుకోండి' అన్నారు.

శివయ్య, 'తమరెవరో సెలవిచ్చారు కాదు', అనగా, రాణీగారు—

'మేము సెలవియ్యాలా? ఎవరినడిగినా తెలుస్తుంది' అంటూ వెనుదిరిగారు. రామన్నగారు పకపక నవ్వుతూ,రాణీగారి చేయందుకుని 'ఓరీ!' అన్నాడు. రాణీగారు, 'శివయ్యబాబూ, పాద దాసుణ్ణి. భాగోతుల బుచ్చిగాణ్ణి!' అంటూ సాష్టాంగపడి, లేచి, 'మీ ఉభయుల దర్శనం చేస్తే తరించుతావని, మామేనమామ చెప్పాడు. పంపాడు. ఏదో నా కూసు విద్య, మీరు చిత్తగించాలని యీ అవకతవక చేశాను—' అని చేతులు జోడించాడు.

శివయ్య వాణ్ణి కౌగలించుకుని, 'నేనూ, వీడూ



ఏకాంత సేవ

చిత్రం — తాళ్ళూరి జయదేవ్ (రంజోల్)

ఆనంద లహరి

నీ ఖ్యాతి విన్నామురా— నీ మేనమామున్నాడే. మాలో ఒకడురా' నీవు మా కూ అల్లుడివేరా! అల్లుడొచ్చి, మావల భరతం పట్టడం, ఆనందంగా ఉందిరా, అబ్బీ! పదనాయనా పోదాం.'

'మా మావలు యీ కటికనేలపై పాదము మోపరాదు. పాలకీ ఎక్కవలె...

యీ అల్లుడు, ఓ హూం—అని కూత పట్టవలె' అన్నాడు బుచ్చిగాడు. రాణీగారత్నే అన్నంతా చేశాడు.

'వచ్చినందుకు ఒక్క పది రోజులుండిపోరా' అన్నాడు రామన్న.

'పది రోజులు కాదు. పొమ్మనేదాకా ఉంటా. మీ అమ్మాయినీ, పిల్లల్నీ రప్పిస్తే.'

—అలాగే ఒక్కమాసం ఉన్నాడు. వారానికో సారి తనవిద్య చూపించేవాడు. అందుకోసం చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజ, అక్కడే ఉండేది.

రామన్నగారు అన్నాడు—'నీ వేషం చూసి, మగవాళ్ల కుమతులు పోతున్నాయిరా. ఆ బ్రహ్మ నిన్ను ఆడదాన్నిగా ఎందుకు పుట్టించలేదురా? పోనీ యిలాగే పుట్టినా, ఆవేషం కట్టేక్షణాన అన్నా ఒక కొంచెం ఆ పోలిక నీ కీయలేకపోయినాడే మిరా?.. మన ఎరికను యిలాటి రెండు మూడు లోపాలు కనబడుతున్నాయి. అందుకే కాబోలు ఆయన అపూజ్యుడైనాడు' అంటూ ఆ ముక్కలే పద్యం కట్టారు.

'శివయ్యమావా. యీ మామ పద్య మిచ్చాడు. అల్లుడికి, నీవేమి యిస్తావు?'

—'నాతంబుర చిరతలు, నాయనా. ఎన్నటి కో ఓ నాటికి, నీకూ, యిప్పటి శక్తి ఉత్సాహం తగ్గుతుంది. ఈ వేషాలు పోయే వయసు దాటు తుంది. అప్పుడన్నా నీ పిల్ల పాపతో వచ్చి, రాముణ్ణి నమ్ముకుని పడుండరా. వేదపారాయణ చేసుకొనే చోట, రాముడు వెలసిన చోట, నీ వంశాభివృద్ధి అవుతుందిరా' అన్నాడు శివయ్య.

వారి పాదాలు కళ్లకు అద్దుకుని సెలవు తీసుకున్నాడు, బుచ్చిగాడు...

అప్పటికి రెండేళ్లాయె—కాటకం.

వాన వెనకబట్టి, గింజ రాలకపాయె.

రామన్నగారి భూమి యావత్తూ, అనగా, బంటుపల్లి, పండకపాయె. కాని, ఊరికి చింత లేకపాయె. వారింట, నిలవ ఉన్న గింజలు ఊరికి సరిపాయె.

కాని, అలా కాలం వెళ్లబుచ్చనియ్యరే, ఏలే వారు!

ప్రజలకు వారిసిబ్బందీ వత్తిడి, ఎక్కువాయె. ఏమున్నది యిచ్చేందుకు? పండని చేలూ, పాటి దిబ్బలూ, నిండుకున్నగాదెలూ, ఎండి పోయిన మూగ జీవాలూ.

ఊరు రామన్న దగ్గరకు వచ్చింది. 'పరగణా విడిచిపోతే, యీ ఒత్తిడి ఉండదండి.' రామన్న 'మంచిదే' అన్నాడు. 'కాని, యింతకాలం వారి పాలనలో ఉన్నాము. ప్రభువులని గౌరవించా ము. వెళ్లేటప్పుడు చెప్పి వెళ్లడం ధర్మం.

వెంటనే దర్శనమైతే, మేలే! కాక, ఆటంకం కలిగిందా, వారికి, ఈ వర్తమానం అందేదాకా, అక్కడే ఉండండి. అక్కడే పరుండండి. కలో గంజో అక్కడే కాచుకు తాగవచ్చు' అనీ అన్నాడు. ఊరివారు అలాగే చేశారు. వీళ్ల ఎదట పడ టానికి జమీందారులు జంకారు. వాళ్లను తరిమి వేయించేందుకు వెనకాడారు. అయినా వాళ్ల అవస్థ ఏమిటో అర్థం చేసుకునేందుకు, మధ్యవాళ్లు అవకాశం కల్పించకపోగా, యిదంతా, ఆ రామన్న ప్రోద్బలం, తమ మీదికి దండు పంపాడు అని, మనవి చేశారు. జమీందారుకు తామసం వచ్చింది. ఈ మూకను చెల్లాచెదరు చేసి, రామన్నను యీడ్చుకు రమ్మన్నాడు.

అప్పుడు రాణివాసమున్న కేతకి గంగి, నాగు పాముల్లే లేచింది. 'రామన్న గారికి ఆ అవమానం చేశావో, ప్రజలు నిన్ను బ్రతకనీరు' అంది. వారు, పెడసరంగా నవ్వారు. భటులను ప్రజల మీదికి దూకమన్నారు.

వాళ్లు దూకారు. చిక్కిన బడ్డారు. వాళ్లని, అందరూ అక్కడి స్తంభాలకి విరిచి కట్టారు.

కొందరు ఆ ఆవేశంలో కోటలోకి జొరబడ పోయినారు. అంతలో తెలివి తెచ్చుకుని, రామన్న గారి ఆజ్ఞ లేదుకదా, అని, ఉన్నచోటే ఆగి పోయినారు.

జమీందారువారు, లోన గడగడలాడిపోతున్నారు. గంగాయే ధైర్యం చెప్పి, రామన్నగారి వద్దకు పరుగున వచ్చి, విన్నవించుకుంది. వారు లేచారు. 'ఒరే శివుడూ, అలా వెళ్లి వస్తారా'—అన్నారు, లోపలికి వెళ్లి.

'ఎలా...?'

'అలా దివాణం దాకా!'

'ఎందుకూ?'

'ఏలినవారి....'

'దర్శనానికా?'

'దోషమా...'

'తిండికి లేదని దెవిరింపా?'

'మరో దేవురింపుకు.'

'రామా! రామ కవి కుంజరు హస్తము క్రిందు చేసి తాపండక బంటుపల్లి. అది పండెనో... యీ కసుమాల ధారుణి మండల నాథుబోలు ఒక మానవ మాత్రుని వేడ బోవునే...' అని వాపోయి నాడు శివయ్య.

'శివుడూ, వాల్మీకుల వారికి మల్లే, కన్నీరు తో కవనమొచ్చిందిరా, నీకు!' అని నవ్వుకుంటూ శివయ్య మొత్రో మంటున్నా వినిపించుకోకుండా, దివాణానికి జేరుకుని, ఆ పరివారం కట్లు విప్పించి, తాను వచ్చానని, లోనికి వర్తమానం పంపిం చాడు. జమీందారు వణుక్కుంటూ వచ్చాడు. రామన్న వారిని చూచి చేజాపి, 'ఏలినవారూ, యాచిస్తున్నాను. కోరినది దయ చేయండి. నే కోరినది వీరి మీద తమ కటాక్షము! ఇంతకాలమూ మీ పరివారము మిమ్మల్ని బంది చేసింది. మీ ప్రజలకు మిమ్మల్ని దూరం చేసింది.

కోటలో ఉంటిరి. పరగణా పండెనో, ఎండెనో మీకు ఎరుకలేక పోయింది. వీరు మీ మీదకు దండు రాలేదు. తమ సన్నిధిలో మొరపెట్టుకుం దామని వచ్చారు. నేనే పంపాను.

ఎలాగూ కోట వెలుపలికి దయచేశారు కనుక, మన గ్రామాల సౌభాగ్యం తిలకించి రండి. నేను తమ వెంట వచ్చేను. చేలుగావవి నెర్రెలు. ఒక్క గింజలేదు. నీటి చుక్కలేదు. చిత్తగించండి. ఇందులో తమ పాలు స్వీకరించండి' అన్నాడు.

—అలాగే తీసుకు వెళ్లి పరగణాఅంతా వెంట ఉండి, చూపించాడు. జమీందారు కంట ఏకధార! 'రామన్నగారూ!' అంటూ, వారి పాదముల తడిపి వేశారు. రామన్నగారు నవ్వారు. 'ఏలిన వారూ, మీ కన్నీట తడిసింది నేల. యిక కరవుండదు' అన్నారు. అప్పుడే ఓ దిక్కునుంచి కారు కమ్ము కొస్తోంది. నాగేంద్రుణ్ణి స్మరించారు, రామన్నగారు. కుంభవృష్టి తడిసి, మనిషైనారు, ఏలిన వారు.

ఆ ఊరు లేదు. ఆ మేరకిప్పుడు పేరు లేదు. రామన్నగారు కూర్చున్న ఆ అరుగు లేదు. ఆ తోట లేదు. ఆ పుట్టలో ఆ నాగేంద్రుడు న్నాడు. ప్రజల జ్ఞాపకంలో వారున్నారు! వారి ఆనంద మున్నది! ★

ప్రశాంతత

చిత్రం—కేతినీడి భాస్కరరావు (విజయనగరం)